కథ

# ఆదర్శం

వాలి హిరణ్మయీదేవి

ఆడుకొంటున్న పిల్లలవంక తదేకంగా చూస్తున్న గోపాలరావు భుజం తడుతూ, "ఇక వెడదామా" అన్నాడు శంకర్రావు.

"తొందరగా ఇంటికెళ్ళి మాత్రం చేసేదేం ఉంది" నిర్లిప్తంగా అన్నాడు గోపాలరావు.

"మా రెండో అమ్మాయ్ దీపావళికి, కుటుంబ సమేతంగా వస్తున్నానని, స్టేషన్‌కొచ్చి రిసీవ్ చేసుకోమని రాసింది. బహుశా ఈపాటికి మా పెద్దవాడెళ్ళి తీసుకొచ్చే ఉండొచ్చు. వాళ్ళుగానీ వచ్చి వుంటారని" అన్నాడు శంకర్రావు.

"అరె మరలా చెప్పవేం-పద పద" కాస్త నొచ్చుకొంటూ బయల్దేరాడు గోపాలరావు.

"అదృష్టవంతుడివిరా శంకరం. రత్నాల్లాంటి పిల్లలు. పెళ్ళై ఇన్నేళ్ళయినా నీ కనుసన్నలు దాటి వెళ్ళరెవరూ. నీ కొడుకూ కోడళ్లతో మనవలతో సందడిగా ఉండే నీ ఇల్లు-ఇక రజనీ, ఆమె పిల్లలూ వస్తే మరింత వెలుగుని నింపుకొంటుంది కదూ" అన్నాడు గోపాలరావు.

శంకర్రావు మనసులోనే గోపాలరావుమీద జాలి పడ్డాడు. ఉన్న ఒక్కగానొక్క కొడుకు పరాయి ఊళ్ళో వుంటున్నాడు. పెళ్ళి చేసుకొన్నప్పుడూ తెలీజేయలేదు. కనీసం పిల్లాడు పుట్టినప్పుడయినా తెలీచేయలేదు. వారిద్వారా-వీరి ద్వారా కొడుకు సంగతులు తెలిసినప్పుడు మాత్రం, తన మనసులోని వేదనంతా శంకరం ముందు వెళ్ళబోసుకొంటూ వుంటాడు. విని, ఏవో నాలుగు ఓదార్పు మాటలు చెప్పడం అలవాటు చేసుకొన్నాడు శంకర్రావు.

గోపాలరావు, శంకర్రావులు ఒకే ఊరివాళ్ళు-కాలేజీ చదువుల వరకూ కలిసి చదివారు. ఉద్యోగరీత్యా కొంతకాలం దూరమయినా, వయసు మళ్ళింతర్వాత తమ ఊళ్ళోనే ఇళ్ళు కట్టుకోవడంతో ఇద్దరిళ్ళ మధ్య మళ్ళీ రాకపోకలు మొదలయ్యాయి.

"అసలు నీలా నేనూ నలుగురు పిల్లల్ని కనాల్సింది. అప్పుడు ఓ కొడుకు చూడకపోయినా, మరో కొడుకు దగ్గరన్నా రోజులు దొర్లించేవాళ్ళం. వాడికి మేం ఏం లోపం చేశామనిరా-మేమింత చేదయ్యాం? వేలకు వేలు ఖర్చుచేసి మంచి బోర్డింగ్ స్కూల్లో చదివించాం. ఎం.బి.ఏ. చేస్తానని వాడంటే అలాగే అన్నాం. ఇప్పుడయినా వాడినుండి నయాపైసా ఆశించడంలేదుకదా-కనీసం ఏడాదికి ఓసారైనా వచ్చి మొహం చూపించి వెళ్ళమంటే వెళ్ళడు. పోనీ మేం గుర్తులేమేమో అనుకోడానికి వీలులేకుండా, మాకవసరంలేదన్నా వినకుండా, ఠంచనుగా ఐదోతారీఖులోపలే ఎం.ఓ. చేస్తాడు. దసరా, దీపావళులకి బట్టలు పంపిస్తాడు. అంతేగానీ మాతో రెండ్రోజులు గడిపి వెళ్ళడు. దేవుడి దయవల్ల మాకు తిండికి బట్టకీ లోటులేదు. ఉన్న లోటల్లా వాడు కన్పించకపోవడమే. అంతటి సూక్ష్మగ్రాహికి ఈ చిన్న విషయం స్ఫురించదంటావా! చెప్ప" బాధగా అన్నాడు గోపాలరావు.

"ఎప్పుడన్నా వెళ్ళి నిలదీసి అడగరాదురా...నీకా హక్కుందిగా" అన్నాడు. వాతావరణాన్ని తేలిక చేయడాన్కి నవ్వుతూ.

"అదీ అయింది. రెండుసార్లు వాడు పనిచేసే ఆఫీస్‌కి వెడితే ఇంటికి రమ్మని ఒక్కసారైనా అనలేదు. పైగా ఎందుకు వచ్చారంటూ డైరెక్ట్‌గానే అడిగాడు. మాకు నువ్వు పంపే డబ్బు అక్కర్లేదు. నువ్వొచ్చి అమ్మకి నీ మొహం చూపించు అంటూ ప్రాధేయపడ్డాను. శిలలా నిలబడ్డాడే తప్ప బదులివ్వలేదు. దాంతో నా మనసు విరిగిపోయింది. కానీ కన్నతల్లి కదా-అది ఏ జన్మలో




ఏం పాపం చేశామో అనుకొంటూ కుళ్ళికుళ్ళి ఏడుస్తూ—దిగులుతో వుంటోంది. దాని బాధ చూడలేకపోతున్నారా" వేదనగా అన్నాడు గోపాల రావు.

స్నేహితుడి ఆవేదన శంకరం మనసుకి బలంగా తాకింది. ఏవిధంగానైనా తండ్రికొడుకుల్ని కలిపే ప్రయత్నం చేయాలి. అనుకొన్నాడు మనస్సులో.

* * * * * *

ఆరోజు దీపావళి. శంకరం భార్య పార్వతి వెళ్ళి గోపాలరావుని, రాధమ్మని తీసుకొచ్చేసింది తమింటికి. శంకరం పిల్లలతో, మనవలతో, తమ వయసు మర్చిపోయి మరీ సరదాగా గడిపారు గోపాలరావు దంపతులు. వాళ్ళ మొహంలో తాండవిస్తున్న ఆనందంని గమనించిన శంకరంకి, తను చేయవలసిందేమిటో గుర్తుకొచ్చింది. ఆ ఆనందాన్ని వాళ్ళకి శాశ్వతం చేయదల్చుకొన్నాడు. పండుగ వెళ్ళి వారం గడిచాక, ఏదో పనిమీద హైద రాబాద్ వెడుతున్నానని చెప్పి, గోపాలరావు కొడుకు రాజు వుంటోన్న బెంగుళూర్‌కి వెళ్ళాడు. దగ్గరున్న



ఆఫీస్ అడ్రస్ సాయంతో రాజు ఇంటి అడ్రస్ కనుక్కోవడం ఏమంత కష్టం కాలేదతనికి.

శంకరంని చూస్తూనే, ఇంత మొహం చేసుకొని ఆహ్వానించాడు రాజు. రాజు భార్య సరళ కూడా ఎంతో కలుపుగోలుగా ఎంతో పరిచయం ఉన్న వ్యక్తిలా మెలిగేసరికి ఆశ్చర్యం కల్గింది శంకరానికి.

"మావారు చిన్నప్పుడు మీ ఇంట్లోనే ఎక్కువగా గడిపేవారట కదా—మీ అందరి గురించి పేరు పేరునా చెబ్తూ వుంటారు. అందుకే మీరు నాకు పరాయి వ్యక్తిలా అన్పించడంలేదు" అంది సరళ, కొసరి కొసరి వడ్డిస్తూ.

గుర్తొచ్చింది శంకరానికి, నిజమే ఎప్పుడన్నా సెల వులకి రాజు వస్తే—రాధమ్మ వేరేవూళ్ళో వుండటం తటస్థించినప్పుడు తమింట్లో ఆ సెలవుల్ని గడిపి వెళ్ళటం.

ఉన్న రెండు రోజులు శంకరంని తన దగ్గరుండి బృందావన్ గార్డెన్స్, చాముండి గుడి, మహ రాజు ప్యాలెస్ మిగిలినవన్నీ చూపించాడు రాజు. పెద్దల పట్ల ఆ భార్యాభర్తలకున్న వినయవిధేయ తలు శంకరం మనసునాకట్టుకొన్నాయ్. వాళ్ళ బాబయితే ఒక్క క్షణం వదలకుండా "గ్రాండ్‌పా అని తిరుగుతూంటే—గోపాలరావుకి దక్కాల్సిందేదో తను అన్యాయంగా లాక్కొన్నట్లనిపించింది శంక రానికి.

ఎంతో వినయంగా ఆదరంగా మాట్లాడుతోన్న రాజుతో తను ఎలా ఈ విషయాన్ని ప్రస్తావించాలో అర్థం కాలేదతనికి. ఆ సాయంత్రం రాజు, శంక రంలు వెళ్ళేసరికి సరళ ఏడుస్తూ ఎదురొచ్చింది. 'బాబు' తప్పిపోయాడంటూ, ఇక దాంతో రాజు కంగారుపడిపోయాడు తెలిసినవాళ్ళిళ్ళలో వాకబు చేశాడు. పోలీస్ కంప్లైంట్ ఇచ్చాడు. ఆ రాత్రంతా ముగ్గురికీ నిద్రలేదు.

తెల్లవారు ఝామున పక్కింటి వాళ్ళొచ్చి బాబుని అప్పచెప్పారు. ఆడుకొంటూ పైకి వెళ్ళాడట బాబు. వాళ్లు రెంట్‌కుండటానికెవరో వస్తే ఆ గది చూపించి, తర్వాత లాక్ చేశారట. అంతకుముందే ఆ పోర్షన్‌లోకి వెళ్ళిన బాబుని గమనించలేదు. తెల్లవారుతుండగా తలుపులు దబదబమంటుంటే వెళ్ళి చూశారుట. అక్కడ బాబు కన్పించాడు. వాళ్ళు క్షమాపణలతో ఆ విషయం చెబ్తూంటే "మీ పొరపాటు మాత్రం ఏముందిలెండంటూ" నచ్చజె ప్పారు. బాబుని అపురూపంగా గుండెలకద్దుకొని కళ్ళ నీళ్ళతో ముద్దులాడుతూ కన్పించాడు రాజు.

"రాజూ! ఒక్కరోజు బాబు కన్పించకపోతేనే ఇంతగా విలవిలలాడావు కదయ్యా. మరి ఎంద రికో ఆదర్శప్రాయుడివై వుండి, మరెందరితోనో మన్ననలందుకొంటున్న నువ్వు నీ తల్లిదండ్రుల విషయంలో చూపిస్తున్న అశ్రద్ధ ఏమన్నా బాగుందా? వాళ్ళూ నీకోసం ఇంతగానే తల్లడిల్లుతున్నారు కదా— అర్థం చేసుకోలేవా" అన్నాడు శంకరం.

దాంతో ఒక్కసారిగా బరస్టయ్యాడు రాజు.

"అంకుల్! నేను చేస్తున్నది తప్పో, ఒప్పో మీరే నిర్ణ యించండి. మీరన్నారే వాళ్ళు నానుండి ఆశించేది ప్రేమాభిమానాలే గానీ డబ్బు కాదని. అది నిజం. ఒకప్పుడు నా చిన్నతనంలో నేనూ వాళ్ళనుండి ఆ ప్రేమాభిమానాలే కోరుకొన్నాను. కానీ దొరకలేదు. ఉన్న ఊళ్ళోవి మంచి స్కూల్స్ కాదంటూ, అనవస రంగా బోలెడు డబ్బు ఖర్చుపెట్టి ఊరుకాని ఊళ్ళో బోర్డింగ్‌లో పడేశారు నన్ను. నాతోటి పిల్లలు వాళ్ళమ్మానాన్నల గురించి ఎంతో మురిపెంగా చెబ్తూంటే నేను ఒక్కడిని హాస్టల్ గదిలో వెక్కి వెక్కి ఏడుస్తూ ఎన్నిరాత్రులు, పగళ్ళు గడిపానో ఆ దేవుడికి తెలుసు. అవసరం ఏమాత్రం లేకున్నా, టైంపాస్ కోసం లగ్జరీల కోసం అమ్మ జాబ్ చేస్తూ నన్ను ఏనాడూ పట్టించుకోలేదు. ఉద్యోగరీత్యా నాన్న ఒక ఊళ్ళో, అమ్మ ఒక ఊళ్ళో—నాకెక్కడికి వెళ్ళాలో తెలీక అయోమయంలో—వాళ్ళతో కలిసి కనీసం భోంచేసే మధురక్షణాలు—ఏవీ లేకుండా ఏకాకిలా పెరిగాను.

నాగురించి డబ్బు ఖర్చు చేశారు—కానీ ప్రేమనివ్వ లేదు. "ప్రేమ ఇచ్చిన ప్రేమ వచ్చును" 'టు రిసీవ్ మోర్ టు గివ్ మోర్' అన్నది మర్చిపోయారు. సెలవులకొచ్చినప్పుడు అమ్మ లేని రోజుల్లో మీ ఇంట్లో గడిపేవాణ్ణి చూడండి అప్పుడు మరింత కొట్టొచ్చినట్లుగా, నేను కోల్పోతున్నది మరింతగా తెలిసేది. అందుకే...అందుకే తప్పని ఓ పక్క అంతరాత్మ చెబుతున్నా—వారి కోరికేంటో తెలిసీ తీర్చలేకపోతున్నాను" అన్నాడు ఆవేశంగా రాజు.

క్షణకాలంపాటు శంకరం ఏమీ మాట్లాడలేకపో యాడు. తనెంతసేపూ గోపాలరావు చెప్పిన కోణం నుండే చూశాడయ్యె.

"రాజూ! నీపరంగా ఆలోచిస్తే—నీ బాధేంటో అర్థ మయింది. కానీ బాబూ! ఎంతైనా వాళ్ళు నీ కన్న తల్లిదండ్రులు. తెలిసో తెలియకో—అప్పుడు జాబ్ లోని సాధకబాధకాల వల్లో అలా జరిగిపోయింది. కానీ 'క్షమ' అనేదొకటుంది. దానర్థం చేతల్లో చూపించు నగంచచ్చి ఉన్నవాళ్ళని పూర్తిగా చంపకు. వాళ్ళ శేషజీవితం ఆనందంగా వెళ్ళమారేలా చెయ్. కనీసం నీ బాబు మొహం చూసైనా, నువే కోల్పోయిన బాల్యపు ఆనందాన్ని తిరిగి పొందు. నీ బాబుకి తాత నానమ్మల ఆప్యాయతని రుచిచూ పించు. నీ కన్నతల్లి దండ్రుల పట్ల నువ్ మెలుగు తున్న తీరేగా బాబుకి ఆదర్శమవుతుంది. లేకుంటే నీ ఇప్పటి అడుగుజాడల్లో వాడూ నడిస్తే—మీరు ప్రేమకి మొహంవాచిపోతారు" అన్నాడు శంకరం.

"నిజమే బాబాయ్! నేనెప్పుడూ ఇది ఊహించలేదు. నేను ట్రాన్స్‌ఫర్ చేయించుకొని మన ఊరికొచ్చే స్తాను. మళ్ళీ నా కొడుకుతో బాటూ నేను పిల్లాడినై బాల్యంలోని మధురిమను చవిచూస్తాను. మా పేరెంట్స్ పట్ల మీకున్న అభిమానం నిజంగా హర్షించదగింది. స్నేహాన్నయినా నిలబెట్టుకున్నం దుకు వాళ్ళకీనాడు కొడుకు—కోడలు—మనవడు దక్కారు" అన్నాడు నవ్వుతూ రాజు.